# సాక్షి
# మంచిర్యాల

శనివారం । 13 । మే । 2023






## ట్రిపుల్ ఐటీ పిలుస్తోంది..!

బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడనుంది. ఆరేళ్ల సాంకేతిక విద్యపై విద్యార్థులు ఆసక్తి చూపిస్తుండగా.. ఏటా వందలాది మంది ఉద్యోగాలు సాధిస్తున్నారు.

IIలో ▸

## 18న జాబ్‌మేళా

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఐఈవో శైలజ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీ సంస్థ టెక్‌బీ ప్రోగ్రాం కోసం జాబ్‌మేళా నిర్వహించనుందని పేర్కొన్నారు. 2022–23 ఎంపీసీ, ఎంఈసీ పూర్తి చేసిన వారు అర్హులని, ఆయా కోర్సుల్లో ఓవరాల్ 75శాతం, గణితంలో 60 మార్కులు సాధించిన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
42.0 /26.0

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగి ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. వాయువ్యం దిశగా వడ గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ‘పది’లో ‘లెక్క’ తప్పింది..!

నెన్నెల: పదో తరగతి ఫలితాల్లో ఎక్కువ మంది విద్యార్థులు గణితంలోనే ఫెయిల్ అయ్యారు. మండలంలో ఒక కస్తూరిబా పాఠశాలతో పాటు నాలుగు ఉన్నత పాఠశాలల నుంచి 236 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 99 మంది విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. ఇందులో 70 మంది విద్యార్థులు గణితంలోనే ఫెయిల్ కావడం గమనార్హం. పాఠశాలలో గణితం ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన కుంటుపడింది. కొన్ని రోజులపాటు ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల హడావుడి నెలకొంది. కోవిడ్ సమయంలో ప్రత్యక్ష బోధన జరగకుండానే విద్యార్థులు పై తరగతులకు ప్రమోట్ కావడం, దీనికితోడు గణిత ప్రశ్నపత్రం కఠినంగా రావడంతో ఎక్కువ మంది గణితంలోనే ఉత్తీర్ణులు కాలేదు. ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి జూన్‌లో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### పల్లె దవాఖానాల్లో అధికారుల తనిఖీ



భీమారంలో రికార్డుల తనిఖీ

భీమారం: మండలంలోని దాంపూర్, భీమారంలోని పల్లె దవాఖానాల్లో మంచిర్యాల డివిజన్ వైద్య, ఆరోగ్యశాఖ హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసూతి అయ్యేలా ప్రణాళికలు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆశావర్కర్లతో గర్భిణుల వివరాలు సేకరించాలని అన్నారు. వారిని నెలనెల ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించాలని తెలిపారు. ప్రతీరోజు 10మందితో ఈ సంజీవిని సేవలు అందించాలని కోరారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేసి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఒక్కొక్కరు 10మందికి తెమడ పరీక్షలు చేయించి క్షయ నివారణలో క్రియాశీల పాత్ర పోషించాలని అన్నారు. సీహెచ్‌ఓ రామూర్తి, సబ్‌యూనిట్ అధికారి నాందేవ్, జైపూర్ ఆరోగ్యకేంద్రం పర్యవేక్షకులు వసుమతి, ఏఎన్‌ఎంలు విజయ, హెల్త్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.


### పక్కపక్కనే మధ్యాహ్న భోజనం



గ్రంథాలయం ఆవరణలో పక్కపక్కనే టేబుళ్లు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పోటాపోటీగా మధ్యాహ్నం భోజనం పంపిణీ చేస్తున్నారు. వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసిన సంస్థలు ఒక్క రోజు గడిచిందో లేదో శుక్రవారం గ్రంథాలయం వేదికగా పక్కపక్కనే వడ్డించారు. దీంతో ఎటు వెళ్లాలో తెలియక అభ్యర్థులు తికమకపడ్డారు. గురువారం కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గాంధీపార్కులో, మున్సిపాలిటీ పాలకవర్గం గ్రంథాలయ ఆవరణలో మధ్యాహ్న భోజనం పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఏమైందో ఏమోగానీ గాంధీపార్కు నుంచి ఉన్న ఫలంగా గ్రంథాలయ ఆవరణకు మార్చడం.. నీడపట్టున పక్కపక్కనే టేబుల్ వేసి వడ్డించగా ఎండలో నిల్చొని విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. నిన్నటి వరకు తిండిలేక తిప్పలు పడిన అభ్యర్థులకు ఒక్క పూట భోజనం పంపిణీకి పోటీపడడం చర్చనీయాంశంగా మారింది. గ్రంథాలయానికి పఠనం కోసం వచ్చే అభ్యర్థులు దూర ప్రాంతాలకు చెందినవారే ఎక్కువ. ఉదయం నుంచి రాత్రి వరకు అభ్యసనం చేయాల్సిన పరిస్థితులు. ఇలా మధ్యాహ్న భోజనం పంపిణీకి పోటీపడడం కంటే ఉదయం.. సాయంత్రం అల్పాహారం అందిస్తే అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

### చెట్లను రక్షించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాలలో అభివృద్ధి పేరుతో చెట్లను నరికివేస్తున్నారని, వాటిని రక్షించాలంటూ బీజేపీ నాయకులు శుక్రవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు కమీషన్ల కోసం అవసరం లేని చోట చెట్లను తొలగిస్తూ డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మున్నరాజ్ సిసోడియా, జిల్లా అధికార ప్రతినిధి తులా మధుసూదన్‌రావ్, నాయకులు లింగన్నపేట విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# ప్రజల్లోనే ఉందాం!

- నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఎమ్మెల్యేలు
- టికెట్టు, గెలుపు కోసం మొదలైన ఆరాటం
- నియోజకవర్గాల్లో పెండింగ్ పనులపై దృష్టి
- ఎన్నికలకు ముందే దూకుడుగా ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వచ్చే డిసెంబర్ లోపు శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు తమ తమ నియోజకవర్గాల్లో పర్యట నల దూకుడు పెంచారు. తమ ప్రాంత ప్రజలతో ని త్యం మమేకం అవుతున్నారు. అటు ప్రజల్లోనూ, ఇ టు పార్టీ అధిష్టానం దృష్టిలో పడి మళ్లీ టికెట్టు తెచ్చుకుని గెలిచేందుకు ప్రజల మధ్యలోనే గడిపేస్తున్నా రు. అధికార పార్టీలో సిట్టింగ్ ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగానే మళ్లీ బీఫాం ఇచ్చేందుకు ప్రధాన కొలమానం కావడంతో వచ్చే ఆరు నెలలు తమ గ్రాఫ్ పెంచుకునే పనిలో ఉన్నారు. నియోజకవర్గాల్లో పెండింగ్ పనుల పూర్తి, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూనే పెళ్లిళ్లు, శుభకార్యాలకు హాజరవుతున్నారు. తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై స్పందిస్తూ అందరికీ చేరవవుతున్నారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఖానా పూర్(జన్నారం) నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రజ ల్లో పట్టు సడలకుండా జాగ్రత్త పడుతున్నారు. రాబోయే ఎన్నికలకు ముందే బలం పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అభివృద్ధి పనులకు నిధులు తెచ్చుకోవడంతోపాటు పనుల్లోనూ వేగం పెంచారు. తమ నియోజవర్గాల్లో ఏదైనా సమస్య ఏర్పడితే పరిష్కరించేలా కృషి చేస్తున్నారు.



మంత్రులు కేటీఆర్, ఐకేరెడ్డి, మహమూద్‌అలీతో రోడ్డు పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే చిన్నయ్య(ఫైల్)

### ‘ఆశీర్వాద సభ’తో చిన్నయ్య జోష్

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంత్రి కేటీఆర్‌ను నియోజకవర్గానికి తీసుకొచ్చి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయించారు. ఎంతోకాలంగా బెల్లంపల్లి పట్టణంలోని ఇళ్ల పట్టాల సమస్యను తీర్చి సక్సెస్ అయ్యారు. పట్టణంలో తాగునీటి సమస్య తీర్చేందుకు కృషి చేశారు. గత డిసెంబర్‌లో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా వంద పడకల ఆసుపత్రి, డయాలసిస్ సెంటర్‌తో ప్రారంభించారు. ఇటీవల కాలంలో తనపై వస్తున్న ఆరోపణలను అభివృద్ధితోనే తిప్పికొట్టేందుకు రెడీ అయ్యారు. తమ నియోజకవర్గ ప్రజలకు సంబంధించిన ప్రతీ సమస్యను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఆశీర్వాద సభ నిర్వహించి అటు కార్యకర్తల్లోనూ జోష్ నింపారు.

### ప్రతీ ఇంటికి దివాకర్‌రావు

మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నిత్యం ప్రజల్లో ఉంటారనే పేరుంది. నియోజకవర్గంలో ప్రతిరోజూ ఏదో ఓ చోట కొబ్బరికాయ కొడుతూ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారు. ప్రజలకు చేరువయ్యేందుకు తమ ట్రస్ట్‌తో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులను పరామర్శ, ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన, గూడెం ఎత్తిపోతలు తదితర సమస్యలపై స్పందిస్తున్నారు. తన నియోజకవర్గంలో ప్రతీ ఇంటి గడప తొక్కుతూ నిత్యం ప్రజల్లో గడిపేస్తున్నారు. జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులు, గ్రామాల్లో పెండింగ్ సమస్యలపై దృష్టి సారించారు.



గూడెం ఎత్తిపోతల పైపులైన్ పరిశీలన(ఫైల్)

### సుమన్ అభివృద్ధి మంత్రం



చెన్నూరులో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన(ఫైల్)

చెన్నూరు నియోజకవర్గంలో గత మూడున్నరేళ్లలో అనేక అభివృద్ధి పనులు మొదలయ్యాయి. ముఖ్యంగా రోడ్లు, తాగునీరు, పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, మార్కెట్లు, పట్టణ కేంద్రాల్లో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లుగా ఆ పార్టీ కార్యకర్తలు చెబుతుంటారు. తమ నియోజకవర్గంలో పెండింగ్ పనులపై నిరంతరం సమీక్షలు, సమావేశాలు నిర్వహించడం, మంత్రులతో పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తన అభివృద్ధి మంత్రమే మళ్లీ గెలిపిస్తుందనే ధీమాలో ఉన్నారు.

### ప్రజల మధ్య రేఖానాయక్



కలమడుగులో రోడ్డు మరమ్మతు పనులు(ఫైల్)

ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న జన్నారం మండలంలో ఎమ్మెల్యే రేఖానాయక్ తరచూ పర్యటిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ ప్రజల్లో గడిపేస్తున్నారు. తన నియోజవర్గంలో పెండింగ్ పనులను పూర్తి చేసేలా ప్రయత్నిస్తున్నారు.

### మళ్లీ భానుడి భగ భగ

- ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- 42.8 డిగ్రీలు నమోదు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఎండల తీవ్రత గత నాలుగు రోజులుగా పెరిగింది. గత నెలలో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యాయి. ఏప్రిల్ నెల 20 నుంచి వాతావరణ మార్పులతో అకాల వర్షాలు, వడగండ్లు, ఈదురుగాలులు అతలాకుతలం చేశాయి. ఈ నెల 9 నుంచి ఎండలు దంచి కొడుతున్నాయి. శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రత 42.8 డిగ్రీలుగా నమోదైంది. వడగాలులు వీస్తుండడంతో వృద్ధులు, పిల్లలు అవస్థలు పడుతున్నారు. రైతులు వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు, నిర్మాణరంగ కూలీలు, సింగరేణి కార్మికులు, రోడ్లపై చిరు వ్యాపారులు చేసుకునేవారు ఎండ తాపంతో అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల తర్వాత బయటకు వెళ్లాలంటే భానుడి ప్రతాపానికి జంకుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో అతిథులు ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాలకు వెళ్లేందుకు సాహసించడం లేదు. రాత్రి పూట ప్రయాణాలకు మొగ్గు చూపుతున్నారు. ఇళ్లలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు రోజంతా నడుస్తూనే ఉంటున్నాయి. మరో నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### సీబీఎస్‌ఈ ‘పది’లో వంద శాతం ఉత్తీర్ణత

మంచిర్యాలఅర్బన్: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) పదో తరగతి శుక్రవారం విడుదలైన ఫలితాల్లో మంచిర్యాల కేంద్రీయ విద్యాలయం నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. పరీక్షల్లో 30 మంది విద్యార్థులకు గాను అందరూ పాసయ్యారు. డి.శాన్విక 476, దీక్షిత 462, ప్రకృతి 456, శ్రీకృత 450, చర్విత హాసిని 450 ఉత్తమ మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సరితా సుభాషిణి తెలిపారు.

# గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు

- జిల్లాకు చేరిన 620 కిట్లు
- ఎంసీహెచ్, సీహెచ్‌సీకి వచ్చేవారికి త్వరలో పంపిణీ
- వచ్చే నెలలోపు అన్ని ప్రభుత్వ ఆనుపత్రులకు సరఫరా
- రక్తహీనత, మాతాశిశు మరణాలు తగ్గించేందుకే..




న్యూట్రిషన్ కిట్

మంచిర్యాలటౌన్: గర్భిణుల్లో రక్తహీనత, మాతాశిశు మరణాల శాతం తగ్గించేలా, పుట్టే పిల్లల్లో పోష్టికాహార లోపం నివారణ కోసం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే తొమ్మిది జిల్లాల్లో న్యూట్రిషన్ కిట్లు అందిస్తుండగా.. మిగతా అన్ని జిల్లాల్లోనూ పంపిణీకి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సంతకం చేశారు. ఇందులో భాగంగా మొదట జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు వచ్చే గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు తొమ్మిది నెలల్లోపు రెండుసార్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. గురువారం జిల్లాలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి 461, చెన్నూరు సీహెచ్‌సీకి 120, బెల్లంపల్లి సీహెచ్‌సీకి 39 మొత్తంగా 620 కిట్లు వచ్చాయి. ఈ నెలలోనే అధికారికంగా ప్రారంభించి గర్భిణులకు పంపిణీ చేసేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలను ప్రోత్సహించేందుకు ఇప్పటికే కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టగా, సాధారణ ప్రసవాలు జరిగేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల్లో 90 శాతానికి పైగా శస్త్రచికిత్స ద్వారానే ప్రసవాలు చేస్తుండగా.. ప్రభు త్వ ఆస్పత్రుల్లో మాత్రమే 60 శాతానికి పైగా సాధారణ ప్రసవాలు అవుతున్నాయి. గర్భిణుల్లో పోష్టికా హార లోపం, రక్తహీనతను నివారిస్తే సాధారణ ప్రసవానికి అవకాశం ఉండడంతోపాటు, పుట్టే పిల్లలు పూర్తి ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో కేసీఆర్ న్యూ ట్రిషన్ కిట్ల పథకం అమలు చేస్తున్నారు. జిల్లాలో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 అర్బన్ హెల్త్‌సెంటర్లు, 3 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, మాతా శిశు ఆ రోగ్య కేంద్రం ఉండగా, విడతల వారీగా అన్ని ప్ర భుత్వ ఆస్పత్రుల్లో అమలు చేయనున్నారు.

**రెండు విడతలుగా**

జిల్లాలో 4,289 మంది గర్భిణులు ఉన్నారు. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మీ పథకం ద్వారా బాలామృతం, గుడ్లు అందిస్తున్నారు. గర్భిణుల్లో రక్తహీనతకు గల కారణాలు, తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించి, పోషణ పక్వాడ, పోషన్ అభియాన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా గర్భిణుల్లో పోష్టికాహార లోపం, రక్తహీనత సమస్యలు అదుపులోకి రావడం లేదు. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణుల్లో 11 నుంచి 15శాతం వరకు హిమోగ్లోబిన్ అవసరమని వైద్యులు పేర్కొంటుండగా, అంతకు తక్కువగా ఉంటోంది. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా గర్భిణులకు పోష్టికాహారం అందించి, రక్తహీనతకు చెక్ పెట్టేందుకు రెండు విడతలుగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్ అందించనున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలకు వెళ్లే గర్భిణుల పేర్లు నమోదు చేసుకుని కేసీఆర్ కిట్ పథకంలో చేరుస్తారు. ప్రసవం అయ్యే వరకు వైద్యుల సూచనల మేరకు వైద్య పరీక్షలు, స్కానింగ్ కోసం ప్రభుత్వ ఆసుపత్రికే వెళ్లాల్సిందే. పేర్లు నమోదు చేసుకున్న వారికి 4 నుంచి 5 నెలల మధ్య ఒకసారి, 7 నుంచి 8 నెలల మధ్య ఒకసారి కిట్లు అందిస్తారు. ఒక్కో కిట్ విలువ రూ.2 వేల వరకు ఉంటుంది.

### కిట్‌లో ఉండేవి ఇవే..

కిట్‌లో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్(మదర్ హార్లిక్స్), కిలో ఖర్జూరా ప్యాకెట్, మూడు ఐరన్ సిరప్ బాటిళ్లు, 500 గ్రాముల నెయ్యి, కప్పు, పల్లి పట్టి 200 గ్రాములు, ఒక బాస్కెట్ ఉంటాయి.

### రక్తహీనతకు చెక్ పెట్టేందుకే



తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రతీ గర్భిణికి రెండు విడతల్లో ఇచ్చే కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు ఉపయోగపడతాయి. పోషకాహార లోపం, రక్తహీనతకు చెక్ పెట్టేందుకు ఎంతగానో ఉపయోగపడి, తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారు. జిల్లాలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం, మూడు సీహెచ్‌సీల పరిధిలోని గర్భిణులకు అందించేందుకు కిట్లు వచ్చాయి.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

# కళాశాలల్లో నర్సుల దినోత్సవం



ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ డే వేడుకలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ప్రపంచ నర్సుల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీమన్నారాయణ, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేదవ్యాస్, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు జోస్విన్, మేరి సుకన్య, ఉమా మహేశ్వరి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన నర్సింగ్ విద్యార్థుల సమక్షంలో నర్సుల దినోత్సవం నిర్వహించారు. నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఫాతిమా జూలియేట్, వైస్ ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

**రెడ్‌క్రాస్ సొసైటీలో**

ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకులో నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తలసేమియా సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందిస్తున్న నర్సులను సత్కరించారు. తలసేమియా ఇంచార్జి కాసర్ల శ్రీనివాస్, రెడ్‌క్రాస్ కోశాధికారి పదాల రవీందర్, కమిటీ సభ్యుడు వి.మధుసూదన్‌రెడ్డి, యెర్ల కిషన్, కాసర్ల రంజిత్ పాల్గొన్నారు.

# గోరింటా పండాలి.. మా బతుకుల్లో వెలుగు నిండాలి



గోరింటాకుతో నిరసనలో జేపీఎస్, ఓపీఎస్‌లు



కుమారుడితో జేపీఎస్

- జేపీఎస్, ఓపీఎస్‌ల వినూత్న నిరసన
- 15వ రోజుకు నిరవధిక దీక్ష

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తమను రెగ్యులర్ చేస్తూ జేపీఎస్, ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేయాలని మంచిర్యాల ఐబీ చౌరస్తాలో చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె శుక్రవారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద మహిళా జేపీఎస్, ఓపీఎస్‌లు సామూహికంగా కలిసి జీఓ రావాలి.. జీపీకి పోవాలి, రెగ్యులర్ చేయాలనే తదితర నినాదాలను తమ చేతులకు గోరింటాకుతో వేసుకున్నారు. గోరింటాకుతో తమ చేతులు ఎర్రగా పండాలి.. ప్రభుత్వం డిమాండ్‌ను పరిష్కరించి మా జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకున్నారు.

**సమ్మెకు వెల్లువెత్తిన సంఘీభావం..**

జేపీఎస్, ఓపీఎస్‌ల దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అదనపు కార్యదర్శి బండి రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బగ్గని రవికుమార్, కార్యదర్శులు గోపాల్, భారతి అశోక్, తాండూరు మండల అధ్యక్షుడు మన్యం రమేశ్, కన్నెపల్లి మండల అధ్యక్షుడు శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బంధ్ర లక్ష్మణ్‌రావు, నాయకులు రాంటెంకి శ్రీనివాస్, గోపాల్, సురేశ్, జాడి రాజన్న తదితరులు సంఘీభావం తెలిపారు. వీరాపూర్ సర్పంచ్ అశోక్‌గౌడ్, టీఆర్‌ఎస్‌వీ బెల్లంపల్లి నియోకవర్గ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. శాంతియుత పోరు సాగిస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌ల సమ్మెను గుర్తించి నోటిఫికేషన్ మేరకు తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.


# పంచాయతీ కార్యదర్శుల కొవ్వొత్తుల ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చెన్నూర్: వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం రంగాపురం గ్రామ పంచాయతీ జూనియర్ కార్యదర్శి సోని ఆత్మహత్యపై చెన్నూర్, కోటపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులు సంతాపం వ్యక్తం చేస్తూ శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తూ రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని అన్నారు. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే ఇంటి ఎదుట వీవోఏల ధర్నా



ఎమ్మెల్యే దివాకర్‌రావుకు వీవోఏల వినతిపత్రం



చెన్నూర్ ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం

పాతమంచిర్యాల: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ వీవోఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. అంతకుముందు ధర్నాలో తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి వెంకటేశ్ మాట్లాడుతూ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పాటైతే తమ సమస్యలు పరిష్కారం అవుతాయనుకుంటే గ్రేడింగ్ విధానం ప్రవేశపెట్టి పని భారం పెంచారని తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి పాటుపడుతున్నామని, పొదుపు, బ్యాంకు రుణాలు ఇప్పిస్తూ ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నామని తెలిపారు. జీతాలు పెంచాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని 26 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అర్హులైన వీవోఏలను సీసీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీవోఏలను చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లు అమలు చేయాలన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి ఎమ్మెల్యే దివాకర్‌రావు ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి శారద, అనిత, లచ్చన్న, లక్ష్మిరాజం, మల్లేష్, కళావతి, సత్యవతి, జ్యోతి, సువర్ణ, భాగ్యలక్ష్మి, వినోద, సత్యవతి, లక్ష్మి, సుజాత, చంద్రకళ, సుమలత పాల్గొన్నారు.

**క్యాంప్ కార్యాలయం ముట్టడి**

చెన్నూర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు శుక్రవారం సీఐటీయూ అధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యే పీఏ మహేందర్‌కు అందజేశారు. ఐకేపీ వీవోఏ జిల్లా అధ్యక్షుడు కుంటాల కుమార్ మాట్లాడుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల వీవోఏలతో ర్యాలీ నిర్వహించి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించినట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, వీవోఏల సంఘం అధ్యక్షులు గౌరీ, సంపత్, లక్ష్మి పాల్గొన్నారు.

### ‘అసైన్డ్ భూములను కాపాడాలి’



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి

పాతమంచిర్యాల: చెన్నూర్ మండలం బాబురావుపేట శివారులోని సర్వేనంబరు 09లో ఉన్న 27 ఎకరాల అసైన్డ్ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు అసైన్డ్ భూమి కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా కాపాడడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అసైన్డ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పేదలు గుడిసెలు వేసుకుంటే పోలీసులు కేసులు నమోదు చేశారని, వీరిలో 18మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు ఇంటి స్థలాలకు కేటాయించాలని, కలెక్టర్, ప్రభుత్వ విప్ పేదలకు న్యాయం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు దూలం శ్రీనివాస్, ప్రేంకుమార్, దుంపల రంజిత్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మైనార్టీ గురుకులం టాపర్‌గా సంకీర్తన


సంకీర్తన

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌లు 204 ఉండగా అందులో ఇంటర్ ఎంపీసీ విభాగంలో మంచిర్యాల మైనార్టీ రెసిడెన్షియల్ గర్ల్స్‌కు చెందిన జి.సంకీర్తన 1000కి 985 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. చెన్నూరులోని రైతు కుటుంబానికి చెందిన తిరుపతిరెడ్డి, స్వరూపల కూతురు సంకీర్తన తెలంగాణ రాష్ట్రంలోని మైనార్టీ గురుకులాల్లో ఎంపీసీలో టాపర్‌గా నిలువడంపై కళాశాల ప్రిన్సిపాల్ దమయంతి అభినందించారు.

### అదుపుతప్పి పత్తివ్యాన్ బోల్తా


జాతీయ రహదారిపై బోల్తాపడిన పత్తివ్యాన్

భీమారం: మంచిర్యాల– చెన్నూరు జాతీయ రహదారిపై కుందారం ఎక్స్‌రోడ్డు సమీపంలో శుక్రవారం చెన్నూరు వైపు పత్తి లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. జైపూర్ మండలం మిట్టపల్లి నుంచి చెన్నూరులో పత్తి విక్రయించేందుకు వ్యాన్‌లో అధిక లోడ్‌తో అతివేగంగా వెళ్తుండగా కుందారం ఎక్స్‌రోడ్డు దాటిన అనంతరం అదుపుతప్పి రోడ్డుపైనే పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు అందులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. రోడ్డుపై బోల్తాపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

### తల్లి మందలించిందని తనయుడు ఆత్మహత్య


మహేశ్ మృతదేహం

మంచిర్యాలక్రైం: తల్లి మందలించిందని తనయుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని ఒడ్డెర కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ వివరాల ప్రకారం.. గండికోట మహేశ్ (16) 9వ తరగతి చదివి మానేశాడు. అప్పటి నుంచి గ్రామంలో జులాయిగా తిరుగుతూ సెల్‌ఫోన్ గేమ్స్‌కు బానిసయ్యాడు. తండ్రి రాజేశ్ గతంలోనే మృతిచెందాడు. దీంతో తల్లి పార్వతి శుక్రవారం మందలించింది. మనస్తాపానికి గురైన మహేష్ ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు అదృశ్యం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంట్రాక్టర్ బస్తీకి చెందిన ఓ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. దేవాపూర్ సిమెంట్ కంపెనీలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బడికెల నరేష్ ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అవివాహితుడైన నరేష్ కొద్ది కాలం నుంచి తాగుడుకు బానిసయ్యాడు. డ్యూటీ చేసే చోట సెల్‌ఫోన్ మర్చిపోయినట్లు చెల్లెలు శ్యామలకు చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ కానరాలేదు. దీంతో నరేష్ అదృశ్యమైనట్లు శుక్రవారం శ్యామల వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

# ట్రిపుల్‌ఐటీ పిలుస్తోంది!

- ప్రవేశానికి త్వరలో నోటిఫికేషన్
- ఆరేళ్ల సాంకేతిక విద్యపై ఆసక్తి
- ఏటా వందలాది ఉద్యోగాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

భైంసా: ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ముగిసి ఫలితాలు కూడా వచ్చేశాయి. ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులంతా కోర్సుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ కాలేజీలో చదివించాలో.. ఏ కోర్సులు చేయించాలో.. అనే విషయంపై విద్యావేత్తల సలహాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా విద్యార్థుల చదువులపైనే ప్రత్యేక చర్చ కొనసాగుతోంది. తెలంగాణలోనే ఏకైక విద్యాలయ ప్రాంగణాన్ని కలిగి ఉన్న బాసర ట్రిపుల్‌ఐటీపై విద్యార్థుల చూపుపడింది. పోషకులంతా తమ పిల్లలను ఇక్కడే చదివించాలని అనుకుంటున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన సీట్ల భర్తీపై ఇప్పటికే యూనివర్సిటీ అధికారులు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు. త్వరలోనే ఇక్కడ 1500 సీట్ల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలకానుంది.


బాసర ట్రిపుల్‌ఐటీ

**గ్రామీణ విద్యార్థులకు వరం**

గ్రామీణ విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించే బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు పోటీపడుతుంటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పల్లె విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ సువర్ణ అవకాశంగా మారింది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుకు సంబంధించి బాసర ట్రిపుల్‌ఐటీలో ఏటా పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి అందులో అర్హత ఉన్నవారిని ఎంపికచేసి సీట్లను కేటాయిస్తోంది. రెండేళ్లక్రితం విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి మొదటిసారిగా పాలిసెట్ అర్హతను జోడించి సీట్లు కేటాయించారు. అప్పట్లో కోవిడ్ నేపథ్యంలో పాఠశాలలు మూసి ఉండడంతో పదో తరగతి విద్యార్థులను పరీక్షలు లేకుండానే ఉత్తీర్ణులు చేశారు. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల సీట్ల కేటాయింపు ప్రక్రియలో పాలిసెట్ అర్హతను జోడించి సీట్లు కేటాయించారు. ఈ ఏడాది పాత విధానంలోనే సీట్లు భర్తీచేయనున్నారు.

**అందుబాటులో 1,500 సీట్లు**

గతేడాది బాసర ట్రిపుల్‌ఐటీలో 1,500 సీట్లు భర్తీ చేయనున్నారు. ట్రిపుల్‌ఐటీ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ఎంతమంది విద్యార్థులకు సీట్లు కేటాయించాలో అనే విషయంలో నివేదిక పంపారు. 2020–21లో ప్రవేశాల కోసం 32వేల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 2021–22లో 20,178 మంది, 2022–23లో 31,432 మంది దరఖాస్తు చేశారు.

**విద్యా విధానం ఇలా..**

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ ఆధారంగా ట్రిపుల్ ఐటీలో బోధన కొనసాగుతుంది. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సును బోధిస్తారు. అనంతరం పీయూసీలో మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజినీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే విద్యార్థులు ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు అన్ని వసతులు సమకూరుస్తారు. ల్యాప్‌టాప్, అందరికీ ఒకేరకమైన దుస్తులు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తోంది. విద్యార్థుల కోసం శారీరక, మానసిక వికాసానికి ఆటలు, కళలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకూ తరగతులు నిర్వహిస్తున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక వైద్యశాల, అధునాతనమైన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

**త్వరలో నోటిఫికేషన్**

బాసర ట్రిపుల్‌ఐటీలో చదివేందుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆసక్తి కనబరుస్తారు. త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తాం. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తాం. ఏటా 30వేలకుపైగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇక్కడ చదివేందుకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు పోటీపడుతున్నారు.

– సతీశ్‌కుమార్, ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్

### తునికాకు సేకరణ ప్రారంభం


బోరంపల్లిలో ఆకులు కట్టలు కడుతున్న కూలీలు

కోటపల్లి: పల్లెలో వేసవిలో ఉపాధి లభించే తునికాకు సేకరణ చెన్నూర్ రేంజ్ సబ్ డివిజన్ పరిధిలో ప్రారంభమైంది. తునికాకు సేకరణకు అటవీశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో విశాలంగా ఉన్న చెన్నూర్ సబ్ డివిజన్ పరిధిలోని 53,723,25 హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉండగా కోటపల్లి, చెన్నూర్, నీల్వాయి పరిధిలో శుక్రవారం నుంచే ఆకు కోతలు ప్రారంభమయ్యాయి. కోటపల్లి మండలంలోని ఆన్నారం, కొల్లూర్, దేవులవాడ, అలుగామ, జనగామ, వెంచపల్లి పరిధిలోని అటవీ ప్రాంతాల్లో తునికాకు సేకరణ జరుగుతోంది. మొత్తం సబ్ డివిజన్ పరిధిలో 123 కల్లాలను ఏర్పాటు చేయడంతో 15,370 మంది కూలీలు ఉపాధి పొందుతారని అధికారులు పేర్కొన్నారు. 8 యూనిట్లకు 15,500 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం నిర్దేశించగా.. లక్ష్యం చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. గతంలో 50 ఆకుల తునికాకు కట్ట రూ.2.50 చొప్పున చెల్లించగా ఈసారి ప్రభుత్వం అదనంగా మరో రూ.50పైసలు పెంచి మూడు రూపాయలు చేయడంతో కూలీల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. దీనికి తోడు అదనంగా బోనస్ వచ్చే అవకాశం ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సమేతంగా సేకరించేందుకు అటవీబాట పట్టారు. దీంతో ఒక్కొక్కరికి రూ.1500 నుంచి 2000 వరకు వచ్చే అవకాశం ఉంటుంది. అటవీ జంతువుల భయంతో కొన్నిచోట్ల తునికాకు సేకరణకు అటవీ ప్రాంతంలోకి వెళ్లడానికి కూలీలు జంకుతున్నారు.

## సెక్యూరిటీ గార్డులను వేధించడం మానుకోవాలి

- బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్


మాట్లాడుతున్న పేరం రమేశ్

శ్రీరాంపూర్: సెక్యూరిటీ గార్డులను అకారణంగా వేధించడం అధికారులు మానుకోవాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్‌లోని ఎస్అండ్‌పీసీ కార్యాలయం వద్ద సెక్యూరిటీ గార్డులను కలిసి మాట్లాడారు. ఓసీపీలో ఇటీవల కాపల గేట్ వద్ద ఓ కాంట్రాక్ట్ కార్మికుడి తలకు గాయమైతే దానికి బాధ్యుడిని చేస్తూ అక్కడ పనిచేసే సెక్యూరిటీ గార్డుకు అధికారులు చార్జీషీటు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఓసీపీ మేనేజర్ ఈప్రమాద సమయానికి ముందు వచ్చి గేట్ మూయించి రిజిస్టర్‌లో సంతకం చేసిన తరువాత ఓ కాంట్రాక్ట్ కార్మికుడు వచ్చిన గేటుకు తగిలి గాయపడితే అది సెక్యూరిటీ గార్డు నిర్లక్ష్యం అనడం అన్యాయమన్నారు. వెంటనే చార్జీషీట్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ కేంద్ర కమిటీ నాయకులు కాదాసి భీమయ్య, వినోద్‌కుమార్, సెక్యూరిటీ ఇంచార్జీ పాదం రవి, నాయకులు సత్యం, లింగం, సందీప్ పాల్గొన్నారు.

## ఏరియా స్టోర్స్‌లో క్లర్క్‌లపై వేధింపులు

- హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్‌లో క్లర్క్‌లపై అధికారుల వేధింపులు మానుకోవాలని హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ హెచ్చరించారు. సేఫ్టీలో భాగంగా ఎస్ఓపీల పేరుతో క్లర్క్‌లకు సంబంధం లేని పనులు అంటగట్టుతున్నారన్నారు. కార్మికులు విధి నిర్వహణలో ప్రమాదాలకు గురి అయితే క్లర్క్‌లను బాధ్యులను చేయడం సరికాదని పేర్కొన్నారు. కంప్యూటర్ల వద్ద పని చేసే క్లర్క్‌లను టోపి, బెల్ట్, బూట్లు ధరించాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. మహిళా కార్మికులు రెస్ట్ హాల్స్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టింబర్ యార్డులో పనిచేసే కార్మికులు 30ఏళ్లుగా వేతనాలు పెరుగుదల లేక శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా తాము లేవనెత్తిన సమస్యలపై స్పందించి కార్మికులకు, క్లర్క్‌లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జీవన్ జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, నాయకులు గోళ్ల సత్తన్న, సాయి క్రిష్ణరెడ్డి, మీస కొమురయ్య, దుర్గం లక్ష్మణ్, నామాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కారుణ్య నియామక పత్రం అందజేత


నియామక పత్రం ఇస్తున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 3 గనిలో పైకప్పు కూలి మృతి చెందిన సత్యనరసింహరాజు కుటుంబానికి కారుణ్య ఉద్యోగం అందించారు. అతడి సోదరి సంధ్యారాణికి శుక్రవారం జీఎం కార్యాలయం వద్ద ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓటూజీఎం గోపాల్ సింగ్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా ఇన్‌చార్జి ఎస్ఓ వెంకటేశ్వర్‌రెడ్డి, డీవైపీఎంలు రాజేశ్వర్‌రావు, దేవేందర్‌రెడ్డి, జీఎం చర్చల ప్రతినిధి వెంగళకుమారస్వామి, సీనియర్ పీఓ కాంతారావు, సిబ్బంది రాజయ్య పాల్గొన్నారు.

### పర్యావరణాన్ని కాపాడాలి


ఓసీపీ వద్ద ఉద్యోగులతో ఐఎఫ్ఎస్ అధికారులు

శ్రీరాంపూర్: ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడటం కోసం కృషి చేయాలని ఐఎఫ్ఎస్ అధికారులు శ్రీనాథ్‌కుమార్, కైలాస్, వినోద్‌కుమార్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి సురేందర్‌పాండే, మంచిర్యాల డీఎఫ్‌వో శివ ఆశీస్‌సింగ్ అన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి ఓసీపీని పరిశీలించి అనంతరం గనిపై ఉద్యోగులతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మనిషి జీవన విధానంలో వచ్చిన మార్పులు, సైకిల్ నుంచి బైక్ వరకు, కట్టెల పొయ్యి నుంచి గ్యాస్‌పొయ్యి వరకు అభివృద్ధి సాధిస్తున్నా... పర్యావరణం కాపాడడంలో మాత్రం వెనుకాల ఉన్నామన్నారు. మొక్కలు నాటడం, వాహన కాలుష్యాన్ని తగ్గించడం చేయాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ ఎస్టేట్స్ జీఎం రవిప్రసాద్, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి, ఓసీపీ మేనేజర్ సుధీర్, ఇంజినీర్ చంద్రశేఖర్, రక్షణాధికారి సంపత్, సర్వే అధికారి సంపత్, సంక్షేమ అధికారి శంకర్ ఉన్నారు.

## పీసీసీఎఫ్‌కు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల వినతి


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

జన్నారం: జన్నారం అటవి డివిజన్ పరిధిలో మేదరి కులస్తుల కులవృత్తికి ఆటంకం కలుగకుండా వెదురు బొంగుల డిపో ఏర్పాటు చేయాలని, కడెం, జన్నారం, ఉట్నూర్ మండలాల పరిధిలో భారీ వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌తో పాటు ఆయా మండల ప్రజాప్రతినిధులు పీసీసీఎఫ్ దోబ్రియాల్‌కు హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలోని కడెం, జన్నారం, ఉట్నూర్ మండలాల్లో అటవీశాఖ భారీ వాహనాలను నిషేధించడంతో వ్యాపారం పూర్తిగా దెబ్బతిని ఉపాధి కోల్పోతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిషేధంపై సడలింపు ఇవ్వాలని కోరారు. అదే విధంగా మేదరి కులస్తులు వెదురు బొంగులతో తడకలు, తట్టలు, బుట్టలు, గుల్లలు అల్లుకుని ఉపాధి పొందే వారిపై అటవీశాఖ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని, దీంతో వారి ఉపాధిపై దెబ్బ పడుతుందని, వెదురుబొంగు డిపోను ఏర్పాటు చేసి మేదరి కులస్తులను ఆదుకోవాలని కోరారు. దీంతో పీసీసీఎఫ్ సానుకూలంగా స్పందించి ఈ విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపారని పేర్కొన్నారు. ఇందులో జన్నారం సర్పంచులు జాడి గంగాధర్, జక్కు భూమేశ్, మానస శ్రీనివాస్, ఎంపీటీసీలు రియాజోద్దీన్, నాయకులు స్వదేశ్‌కుమార్, సతీశ్‌కుమార్, మహేంద్ర సంఘ నాయకులు నర్సింగరావు, చిలువేరు నర్సయ్య ఉన్నారు.

## కొనసాగుతున్న ఎన్‌హెచ్ 63 బాధితుల దీక్ష


బాధితులతో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–అర్మూర్ నాలుగు వరసల జాతీయ రహదారి 63 నిర్మాణ పనుల్లో భాగంగా చేపడుతున్న భూ సేకరణ సర్వే పనులు నిలిపి వేయాలంటూ ఎన్‌హెచ్ 63 బాధితుల నిరసన దీక్ష కొనసాగుతోంది. శుక్రవారం తెలంగాణ ఫిలిం బోర్డు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూస్కూరు రామ్మోహన్‌రావు బాధితుల దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. తమ విలువైన భూములు, ఇండ్లు కోల్పోతున్నామంటూ బాధితులు ఆయన దృష్టికి తీసుకురాగా రోడ్లు, భవనాల శాఖా మంత్రితో పాటు అవసరమైతే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య త్వరితగతిన పరిష్కారం చేసే దిశగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట రైతుబంధు మండల కన్వీనర్ పూస్కూరు శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకులు దొమ్మటి సత్తయ్య, బొడ్డు శంకర్, సింగతి మురళి, ఒడ్నాల సత్యనారాయణ ఉన్నారు.

## ఏఎస్సై వెంకటరెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కు ఇస్తున్న డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్

నెన్నెల: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన 1989 బ్యాచ్‌కు చెందిన ఏఎస్సై మూల వెంకటరెడ్డి 2023 జనవరి 9న అనారోగ్యంతో మృతి చెందాడు. ఏఎస్సైలు అంతా తమ బ్యాచ్‌మెంట్ కుటుంబానికి బాసటగా నిలువాలని భావించారు. రూ.లక్ష జమ చేసి మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో శుక్రవారం డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ చేతుల మీదుగా వెంకటరెడ్డి భార్య మూల శ్రీకళకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఏఎస్సై మజీద్, ట్రాఫిక్ ఏఎస్సై నందయ్య, రిటైర్డ్ ఏఎస్సై వీరస్వామి పాల్గొన్నారు. తాండూర్ ఏఎస్సై లక్ష్మణ్, బెల్లంపల్లి ఏఎస్సై తిరుపతి, నిర్మల్ ఏఎస్సైలు శ్రీనివాస్ పండరి, కాగజ్‌నగర్ ఏఎస్సై వర్మ, ఆదిలాబాద్ ఏఎస్సైలు జహీరోద్దీన్, సుభాష్, మంచిర్యాల మహిళా పీఎస్ ఏఎస్సై రాజేష్ ఉన్నారు. సాయం చేసిన వారిని డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.



### అదుపుతప్పి వాహనాలను ఢీకొట్టిన వ్యాన్


వాహనాలను ఢీకొట్టి నిలిచిన వ్యాన్

భీమారం: చెన్నూరు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న బొలేరో వ్యాన్ శుక్రవారం భీమారం బస్టాండ్ వద్ద జాతీయ రహదారి పక్కనే నిలిపి ఉన్న వాహనాలను ఢీకొట్టింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అంతకు ముందు రెండు ద్విచక్రవాహనాలను కూడా ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. కోటపల్లి మండలం నుంచి భీమారం మండలం బూర్గుపల్లికి టెంట్ హౌస్ సామగ్రితో వెళ్తుంది. కాగా ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాతో పాటు వ్యాన్లు ధ్వంసమయ్యాయి. ఏఎస్సై భూమన్న సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

### నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత


పట్టుబడిన విత్తనాలతో రవి

ఆసిఫాబాద్‌రూరల్: నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న దుర్గం రవిని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ వివరాల ప్రకారం... రెబ్బెన మండలంలోని నార్లపూర్ గ్రామానికి చెందిన దుర్గం రవి ఆసిఫాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మకానికి నకిలీ పత్తి విత్తనాలను (గ్లెసిల్ బీటీ–3) తరలిస్తున్న సమయంలో బూర్గుడ వద్ద 40 కేజీల విత్తనాలను పట్టుకుని ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ కేసు నమోదు చేశారు. వాటి విలువ రూ.లక్షా50వేలు ఉంటుందని, వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, ఎస్సై సందీప్‌కుమార్, కానిస్టేబుల్ మధు, రమేష్, సంజయ్ ఉన్నారు.

**ఐదు నకిలీ ప్యాకెట్లు ..**

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మహారాష్ట్రకు చెందిన సూరజ్ మాగేష్ బోయర్ వద్ద నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. శుక్రవారం రెబ్బెన వ్యవసాయ విస్తరణ అధికారి సంజీవ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తనిఖీ చేస్తుండగా సూరజ్ మాగేష్ బోయర్ అనుమానాస్పదంగా కనిపించగా ఐదు నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు లభ్యమయ్యాయి. దీంతో అతడిని విచారించగా నారాయణపూర్‌కు చెందిన రవితో పరిచయం ఏర్పడింది. రవి పత్తి విత్తనాలు కావాలని మాగేష్‌ను కోరగా మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చాడు. రవి రెబ్బెన బస్టాండ్ వద్ద ఉండమని మాగేష్‌కు చెప్పాడు. ఆ సమయంలో పట్టుకున్నారు. వాటి విలువ రూ.5500 ఉంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నర్సుల సేవలు వెలకట్టలేనివి


బెల్లంపల్లి: నర్సును సత్కరిస్తున్న ఎమ్మెల్యే


రెబ్బెన: సన్మానిస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

బెల్లంపల్లి: నర్సుల సేవలు వెలకట్టలేనివని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవా న్ని ప్రభుత్వ, సింగరేణి ఏరియా ఆసుపత్రుల్లో వేర్వేరుగా నిర్వహించారు. ఆయా చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. రోగులకు ఉత్తమ సేవలు అందిస్తున్న నర్సులకు శాలువ కప్పి సన్మానం చేశారు. అనంతరం చిన్నయ్య మాట్లాడుతూ.... నర్సుల వృత్తి ఎంతో ఉన్నత మైందని అన్నారు. ఓపికతో చేస్తున్న సేవలతో రోగులు సత్వరంగా కోలుకోవడానికి వీలు ఉంటుందన్నారు. వీరు సేవలు మాటల్లో చెప్పలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, ఎంపీపీ శ్రీనివాస్ , మున్సిపల్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి వెంకటేష్, టీబీజీకేఎస్ ఏరియా ఆసుపత్రి ఫిట్ సెక్రెటరీ అనుముల సత్యనారాయణ పాల్గొన్నారు.

**గోలేటి డిస్పెన్సరీలో..**

రెబ్బెన: హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఆధ్వర్యంలో శుక్రవారం గోలేటి డిస్పెన్సరీలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్పెన్సరీలో పనిచేస్తున్న నర్సులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ఇనూస్, వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శి వశీం, ఎస్అండ్‌పీసీ ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**సింగరేణి ఆధ్వర్యంలో..**

గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీలో వైద్య రంగంలో నర్సుల వృత్తికి వన్నె తెచ్చిన నైటింగల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వైద్యులు రాధాకృష్ణ, వైద్యురాలు అనూషలు నర్సుల సేవలు కొనియాడారు. కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జి స్టాఫ్ నర్సు జయశీల, స్టాఫ్ నర్సు రాజేశ్వరి, కొమురమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### నవోదయ విద్యార్థుల ప్రతిభ

- వంద శాతం ఉత్తీర్ణత

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 10, 12వ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. సీబీఎస్ఈ బోర్డు శుక్రవారం ఫలితాలను ప్రకటించగా కాగజ్‌నగర్ విద్యాలయంలో 10వ తరగతిలో 79మంది పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఇందులో 41మంది విద్యార్థులు 91 నుంచి వంద శాతం, 38 మంది 75 నుంచి 90శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఎ.శ్రీనిత్య 500 మార్కులకు 486, కె.సాత్విక్ 483, ఇ.తిరుమల, ఎం.మహేష్ 479 టాపర్లుగా నిలిచారు. 12వ తరగతిలో 73 మంది పరీక్షలకు హాజరు కాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. సైన్స్ విభాగంలో 39 మందిలో 91 నుంచి వంద శాతం, 29 మంది 75 నుంచి 90 శాతం, 8 మంది 60 నుంచి 75శాతం మార్కులు సాధించారు. కామర్స్ విభాగంలో 34 మందిలో 90 నుంచి 100 శాతం మధ్య ఏడుగురు, 75 నుంచి 90 శాతం మంది విద్యార్థులు 15, 60 నుంచి 74 శాతం 12 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సైన్స్ విభాగంలో జి.వివేక్ 500 మార్కులు, ఎం.కార్తీకేయ 465, ఎస్.సాయిక్రిష్ణ 448, కామర్స్ విభాగంలో దుర్గం అభినవ 479, టి.సాయి వర్ధన్ 478, ఎం.మైత్రేయ 468 మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, కుటుంబ సభ్యులు అభినందించారు.

## సేవ చేసే అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

### ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సచివాలయంలోని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఐటీ కొత్త నిబంధనలపై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: పన్ను మినహాయింపు నిబంధనల్లో వచ్చిన మార్పులను పన్ను చెల్లింపుదారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గమనించాలని న్యూఢిల్లీ చీఫ్ కమిషనర్ (మినహాయింపులు) రేణు జౌహ్రీ సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపులో కొత్త, సవరించిన నిబంధనలను వివరించడానికి, హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఆదాయపు పన్ను టవర్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణు జౌహ్రీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్నులో మినహాయింపు సెక్షన్లలో తెచ్చిన కొత్త నిబంధనలు, సవరణలను తెలిపారు. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పీఓ)ల నమోదులో ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం ప్రారంభమైందని, ఇప్పటికే ఉన్న ఎన్‌పీఓలు, కొత్త ఎన్‌పీఓలు ఏదైనా మినహాయింపును క్లెయిమ్ చేయడానికి కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, నిర్దిష్ట ఉల్లంఘనలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. మినహాయింపును క్లెయిమ్ చేయడానికి, ఆదాయ రిటర్న్‌ను దాఖలు చేయడం తప్పనిసరని, అవసరమైన ఆడిట్ నివేదికలు, ఇతర నివేదికలను సమయానుకూలంగా సమర్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఐటీ (మినహాయింపులు) వి.కోటేశ్వరమ్మ, డీసీఐటీ (మినహాయింపులు) సుధా కొరివి, డీసీఐటీ (మినహాయింపులు) ధృవాష్ట, ఆదాయపు పన్ను అధికారులు, పన్ను బార్ అసోసియేషన్ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

## అధ్యాపకుడు మధుసూదన్ రెడ్డిని తొలగించండి

### ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: సస్పెండైన సరూర్‌నగర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పి.మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ సిఫార్సు చేశారు. మధుసూదన్ రెడ్డిపై అవినీతితో పాటు, బాధ్యతారాహిత్యం, విధుల్లో క్రమశిక్షణ రాహిత్యం, ఉద్యోగులను బెదిరించడం, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆయనను విధుల నుంచి తొలగించడం సరైన నిర్ణయమని ప్రభుత్వ కార్యదర్శికి పంపిన ఫైల్‌లో నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

## ఐసీఐడీ వేదికలో భాగస్వామి కండి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సాగులో నీటి ఎద్దడి నివారణ అనే థీమ్‌తో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ ఇరిగేషన్, డ్రైనేజీ కమిషన్ (ఐసీఐడీ) అంతర్జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఈఎన్సీ మురళీధర్‌ను కలిసి సమావేశం వివరాలను తెలిపారు. 57 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత భారతదేశానికి ఈ అవకాశం వచ్చిందని, విశాఖ వేదిక కానుందని పేర్కొన్నారు.

## కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని భారతీయ జనతా యువమోర్చా డిమాండ్ చేసింది. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను బలోపేతం చేసి ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం రూపొందించిన నివేదికతో ప్రైవేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్‌కు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం వినతి పత్రం సమర్పించింది.


## కాలులేని భార్యను భుజంపై మోసుకొని..

### వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్‌లేక రోగి అవస్థ • చికిత్సకు వచ్చి వెళ్లే క్రమంలో ఘటన • సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్ అందుబాటులో లేక ఓ వృద్ధుడు తన భార్యను చికిత్స అనంతరం భుజాలపై మోసుకెళ్లిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మాలోతు లక్ష్మికి నవంబర్‌లో కుడికాలి రక్తప్రసరణ ఆగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు కింద నుంచి కాలును తొలగించారు. రోగిని 15 రోజులకోసారి డ్రెస్సింగ్ కోసం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని ఆమె భర్త ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అక్కడున్న సిబ్బంది 'పెద్ద సార్ లేరు.. రేపు రావాలని చెప్పారు. అయితే ఆ సమయంలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో భుజాలపై మోసుకుంటూ మండుతున్న ఎండలోనే బయటకు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందించారు. డ్రెస్సింగ్ అనంతరం పేషెంట్ కేర్ సిబ్బంది రోగిని వీల్‌చైర్‌లో క్యాజువాలిటీ నుంచి బయటకు తీసుకొచ్చారని తెలిపారు. కాలిపర్ (కాలుకు అమర్చే లోహ పరికరం) సేవల కోసం వెళ్లగా శనివారం అందుబాటులో ఉంటుందని, అప్పుడు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. దీంతో తిరిగి వెళ్లే క్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా భర్త తన భార్యను ఒక చెట్టు వద్దకు తీసుకెళ్లేందుకు భుజంపై ఎక్కించుకొని వెళ్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలతో ఆస్పత్రిని అభాసుపాలు చేయవద్దని కోరారు.

### టుడేస్ గ్రాఫిక్

మీకో విషయం తెలుసా? ప్రతి నాలుగు నిమిషాలకు ఈ భూమ్మీద వెయ్యి మంది పుడతారట. అయితే, ఆ వెయ్యి మందిలో ఏ దేశంలో ఎంత మంది జన్మిస్తారు? అల్రెడీ జనాభాలో నంబర్ వన్‌గా ఉన్న మనం.. ఈ విషయంలోనూ మొదటి స్థానంలోనే ఉన్నాం. వచ్చే నాలుగు నిమిషాల్లో ఆ వెయ్యిమందిలో 172 మంది భారత్‌లోనే పుడతారట. మరి మిగతా దేశాల సంగతేంటో.. ఓసారి చూద్దామా..




# అడవులు కేంద్రంగా ఉగ్రవాద శిక్షణ

- ఆయుధాలు సమీకరించింది మహ్మద్ సలీం
- అక్కడి బృందానికీ ఇతడి ద్వారానే శిక్షణ
- ఈ ఐదుగురి నుంచి విదేశాలకు ఫోన్ కాల్స్



నగరంలో అరెస్టు చేసిన ఐదుగురినీ భోపాల్ కోర్టులో హాజరుపరుస్తున్న ఏటీఎస్

సాక్షి, హైదరాబాద్: నగరంతో పాటు భోపాల్‌లో పట్టుబడిన 16 మంది ఉగ్రవాదులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివార్లలో ఉన్న వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల మాదిరిగానే భోపాల్ సరిహద్దుల్లోని రైసెన్ అడవిని ఎంచుకున్నట్లు ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. అక్కడ అరెస్టయిన 11 మందితో పాటు నగరంలో చిక్కిన ఐదుగురినీ ప్రస్తుతం ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. –భోపాల్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సయ్యద్ డానిష్ అలీ ఇంటిలో సూత్రధారి యాసిర్ ఖాన్ నిర్వహించిన సమావేశాలకు నగరం నుంచి సలీంతో పాటు అబ్దుల్ రెహ్మాన్, షేక్ జునైద్ కూడా హాజరయ్యారని ఏటీఎస్ చెప్తోంది. దానికి సంబంధించిన ఆధారాలు సైతం తమకు లభించినట్లు స్పష్టం చేస్తోంది. గోల్కొండలోని సలీం నివాసంలో ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్, భోపాల్‌లోని యాసిర్ ఇంటి నుంచి నాటు తుపాకీ, తూటాలు సీజ్ చేశారు. ఈ నాటు తుపాకీ సేకరించింది, భోపాల్ మాడ్యూల్‌కు శిక్షణ ఇచ్చింది కూడా సలీం అని ఏటీఎస్ అనుమానిస్తోంది. ఆ కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

**విదేశీ నంబర్లకు ఫోన్లపై ఆరా**

నగర మాడ్యూల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఫోన్ల నుంచి విదేశీ నెంబర్లకు ఫోన్లు వెళ్లినట్లు అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు వాటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి విదేశాల్లో ఉన్న వారితో ఉన్న సంబంధాల పైనా దర్యాప్తు చేయనున్నారు. ఉగ్రవాద సాహిత్యాన్ని తన ల్యాప్‌టాప్ వినియోగించి సొంతంగా తయారు చేసిన సలీం అందులో అనేక అంశాలు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఉన్న విషయాలతో పాటు వివిధ పుస్తకాల్లోని అంశాలు క్రోడీకరించి రూపొందించిన ఇందులో జిహాద్, ముజాహిదీన్ అంటే ఏమిటి? తాము ఏం చేయాలి? అనే వివరాలతో పాటు ఉగ్రవాద చర్యల్లో పాల్గొంటూ చనిపోయిన వారి కుటుంబాలను ఎలా ఆదుకోవాలి? ఎలాంటి ఆయుధాలు సమీకరించుకోవాలి? క్యాడర్‌ను ఎలా రిక్రూట్ చేసుకోవాలి? తదితర వివరాలు పొందుపరిచాడు.

**ఈ కేసులో సాక్షులుగా 'వారు'**

సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఆకర్షించారు. వీళ్లు కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని భావించిన వాళ్లు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు. అయితే కొన్నాళ్లకే వీరి వ్యవహారశైలి, కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరయమ్యారు. వీరిని గుర్తించి, ఈ కేసులో సాక్షులుగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు.

**ముగ్గురి ఇళ్లకు సీసీ కెమెరాలు**

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కిన ఐదుగురి ఉగ్రవాదుల్లో ముగ్గురి ఇళ్లకు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఏటీఎస్ అధికారులు, పోలీసులు దాడి చేయడానికి వచ్చారనే విషయం వీటిలో చూసి వాళ్లు గుర్తించారు. దీంతో ఉగ్రవాద సాహిత్యం దొరక్కుండా చేయడానికి ప్రయత్నాలు చేశారు.

## ఈనెల 15 నుంచి సీఎం కప్

- పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకేనన్న శాట్స్ చైర్మన్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్–2023 పేరిట ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో క్రీడా సంబరాలను నిర్వహించనుంది, ఈనెల 15 నుంచి 31వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి.15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సుగల పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే క్రీడలు, వాటి నిర్వహణ, అందులో ఎవరెవరు ఉండాలనే అంశాలను రాష్ట్ర క్రీడా ప్రాదిరాన సంస్థ (శాట్స్) విడుదల చేసింది.

**నిర్వహించనున్న క్రీడలు.. :** ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయి. పురుషులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, ఈత పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల నిర్వహణకు మండల స్థాయికి రూ.15 వేలు, జిల్లా స్థాయికి రూ.75 ఇవ్వనున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికుల నుంచి నిధులను సమకూర్చుకోవచ్చు.

**నగదు ప్రోత్సాహకాలు..**

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో బహుమతిగా ప్రథమ–రూ.20 వేలు, ద్వితీయ–రూ.15 వేలు, తృతీయ–రూ.10 వేల నగదు అందజేయనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలనూ అందజేస్తారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు.

## బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా!

- తాళి కట్టేందుకు మొండికేసిన వరుడు
- బైక్‌కు డబ్బులిచ్చి.. పెళ్లికి ఒప్పించిన ఎమ్మెల్యే రసమయి
- కరీంనగర్ జిల్లాలో ఘటన



శంకరపట్నం(మానకొండూర్): పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు మొండికేయడంతో అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే తానుబండి కొనిస్తా అని డబ్బులు ఇచ్చి వివాహంజరిపించిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటుచేసుకుంది. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య కూతురు అనూష వివాహం సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సంఘాల వినయ్‌తో కుదిరింది. రూ.5 లక్షల కట్నంతో పాటు మోటార్ సైకిల్ కొనిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కట్నం డబ్బులు ముట్టచెప్పారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పెళ్లి మండపానికి వధువు, వరుడి బంధువులు చేరుకున్నారు. కొత్తజంటను ఆశీర్వదించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కూడా హాజరయ్యారు. తీరా.. తాళికట్టే సమయంలో మోటార్ సైకిల్ కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు వినయ్ మొండికేశాడు. దీంతో వరుడు, వధువు బంధువులు గొడవకు దిగడంతో ఎమ్మెల్యే రసమయి జోక్యం చేసుకుని పెళ్లి కొడుకు వినయ్‌తో మాట్లాడి మోటార్ సైకిల్ కొనుక్కోమని సొంత డబ్బులను (సుమారు రూ.50వేలు) అప్పటికప్పుడే పందిట్లోనే అందించారు. మిగతా సొమ్ము కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దగ్గరుండి వివాహం జరిపించి నూతన జంటను ఆశీర్వదించారు. తోడబుట్టిన అన్నగా పెళ్లి మండపంలో పరువు కాపాడావని మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ కన్నీరు పెట్టుకుంది.

# అజ్ఞాతానికి తెర

- 2004లో మావోయిస్టు దళంలోకి జ్యోతక్క
- కరీంనగర్ పోలీసు కమిషనర్ ఎదుట లొంగుబాటు



శివంగాలపల్లి గ్రామం

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్క లొంగిపోవడంతో 20 సంవత్సరాల అజ్ఞాతానికి తెర పడినట్లయింది.

**మావోయిస్టు జ్యోతి నేపథ్యం..**

కోనరావుపేట మండలం శివంగాలపల్లికి చెందిన నేరెళ్ల నర్సయ్య– భూదవ్వకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. చిన్న కూతురు జ్యోతి ఐదో తరగతి వరకు స్థానిక పాఠశాలలో, 6–10 వరకు కోనరావుపేట ఉన్నత పాఠశాలలో, ఇంటర్ సిరిసిల్ల ప్రభుత్వ కళాశాలలో చదివింది. 2004లో శివంగాలపల్లిలో అప్పటి దళ కమాండర్ పద్మక్క గ్రామంలో సమావేశం నిర్వహించగా, ఆమె మాటలు విని జ్యోతి ఉద్యమం పట్ల ఆకర్షితురాలైంది. కళాశాలలో చదువుతుండగానే సీవో రఘు ఆధ్వర్యంలో మావోయిస్టుల్లో చేరి అజ్ఞాతంలోకి వెళ్లింది.

**20 ఏళ్లలో వివిధ హోదాలు**

మావోయిస్టుల్లో చేరిన జ్యోతక్క మొదట మదిమల్ల ఎల్‌జీఎస్ దళ సభ్యురాలిగా ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, చందుర్తి, కథలాపూర్, నిజామాబాద్ జిల్లా సిరికొండ, భీంగల్ ప్రాంతాల్లో పనిచేసింది. 2011లో కర్రిగుట్ట(ఆదిలాబాద్ జిల్లా)లో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత ఒడిశా రాష్ట్రానికి వెళ్లింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రెస్ ఇన్‌చార్జిగా పనిచేస్తోంది. పార్టీలో ఉండగానే దినేశ్ అలియాస్ ఎర్రగొల్ల రవిని పెళ్లి చేసుకుంది. అతడి వేధింపులు భరించలేక విడిపోయి ఇన్నాళ్లు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో పనిచేసింది.

**ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా అలజడే..**

ఏ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ జరిగినా శివంగాలపల్లిలో అలజడి నెలకొనేది. మృతి చెందింది మహిళా నక్సలైట్ అయితే చాలు తమ జ్యోతే కావొచ్చని తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. పోలీసులు పలుమార్లు కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి జ్యోతి లొంగిపోవాలని కోరారు. తండ్రి నర్సయ్య, సోదరుడు మల్లయ్య మృతి చెందగా మరో సోదరుడు ఆటో నడుపుకుంటూ సాధారణ జీవితం గడుపుతున్నాడు. ఎప్పటికైనా తమ కూతురు రాకపోతుందా అని ఎదురుచూస్తున్న వారి కోరిక ఇన్నాళ్లకు నెరవేరడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రశాంతంగా ఇంజినీరింగ్ ఎంసెట్



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్: ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఎంసెట్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం పకడ్బందీగా పరీక్షను నిర్వహిస్తోంది. ఈ నెల 12వ తేదీనాటి పరీక్ష ఉమ్మడి జిల్లాలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ జోన్, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో 2 కేంద్రాలు, కరీంనగర్‌లోని వివేకానంద, అల్ఫోర్స్, హుజూరాబాద్‌లోని కిట్స్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. గంటన్నర ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇచ్చారు. విద్యార్థుల హాల్ టికెట్ బార్ కోడింగ్ ద్వారా పరీక్షించి కేంద్రంలోకి అనమతిచ్చారు. జ్యోతిష్మతిలో 80 మంది విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం 78మంది హాజరయ్యారు. వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్లో 722 మంది విద్యార్థులకు ఉదయం 696మంది, మధ్యాహ్నం 701మంది హాజరయ్యారు. వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో 110మంది విద్యార్థులకు ఉదయం 107 మంది, మధ్యాహ్నం 108మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య 1 కళాశాలలో ఉదయం 80మందికి 79మంది హాజరుకాగా, మధ్యాహ్నం 80మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య–2లో ఉదయం 200 మంది విద్యార్థులకు 196మంది, మధ్యాహ్నం 195మందికి హాజరయ్యారు. అల్ఫోర్స్‌లో 55మందికి ఉదయం 52మంది, మధ్యాహ్నం 55మంది హాజరయ్యారు. హుజూరాబాద్ కిట్స్ కళాశాలలో ఉదయం 90మందికి 88మంది హాజరుకాగా, మధ్యాహ్నం 86మంది హాజరయ్యారు. వివేకానందలో 105మందికి ఉదయం 104మంది, మధ్యాహ్నం 103 హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ ప్రమోద్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు..

- మళ్లీ విధుల్లో చేరారు..
- ఇది ఉపాధ్యాయుల తీరు


జగిత్యాల: జిల్లాలో గత మార్చి 15 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించిన విషయం విదితమే. సారంగాపూర్ మండలంలోని పది మంది ఉపాధ్యాయులకు ఈ పరీక్షలకు ఇన్విజిలేషన్ విధులు అప్పగించారు. వారు మార్చి 14న మధ్యాహ్నం 2 గంటల వరకు రిలీవ్ అయి తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో రిపోర్టు చేశారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా కొందరు ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రాల్లో పర్యవేక్షణకు వెళ్లలేదు. అటు పాఠశాలకు వెళ్లకుండా, ఇటు పరీక్ష కేంద్రాలకు హాజరు కాకుండానే 15 రోజులు ఎక్కడో గడిపారు. అయితే, మళ్లీ పాఠశాలలో చేరేందుకు హెడ్‌మాస్టర్లు అయితే, ఎంఈవో, ఉపాధ్యాయులైతే హెడ్‌మాస్టర్‌కు రిపోర్టు చేయాలి. ఇందుకోసం తాము ఇంటర్ పరీక్షలకు పర్యవేక్షకులు విధులు నిర్వర్తించినట్లు డ్యూటీ సర్టిఫికేట్లు సమర్పించాలి. కానీ, ఎంఈవోతోపాటు హెడ్మాస్టార్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే విధుల్లో చేరినట్లు తెలిసింది. సుమారు 15రోజుల పాటు ఇన్విజిలేషన్‌కు వెళ్లకుండా, అంటు పాఠశాలలకు హాజరు కాకుండా నిబంధనలు అతిక్రమించిన డుమ్మా టీచర్లు, హెడ్‌మాస్టర్లు వేతనం పొందినట్లు తెలిసింది. ఒకరిద్దరు గైర్హాజరు కావడం, మరికొందరు అసలు పర్యవేక్షణ విధులకే వెళ్లకుండా మళ్లీ స్కూళ్లలో చేరి, వేతనం పొందినట్లు ప్రచారం జరుగుతోంది.

**డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వలేదు**

ఇంటర్మీడియెట్ పర్యవేక్షకులుగా వెళ్లిన కొద్దిమంది ఉపాధ్యాయులు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వలేదు. ఈనెల 15లోపు అందజేస్తామని వారు తెలిపారు. ఒకవేళ వారు ఇన్విజిలేషన్ విధులకు హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటాం.

– భీమయ్య, ఎంఈవో, సారంగాపూర్

## రాజన్న సేవలో ఏడీసీ



దర్శనానికి వెళ్తున్న ట్రిబ్యునల్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు

వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం రాష్ట్ర దేవాదాయశాఖ ట్రిబ్యునల్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆయన వెంట పర్యవేక్షకులు శ్రీరాములు, అల్లి శంకర్, ఏఈ డి.శేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## 'మన బడి' భద్రతకు వాచ్‌మెన్




మన బస్తీ–మనబడిలో ఎంపికైన మంచిర్యాల న్యూ గర్మిళ్ల పాఠశాల

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల్లో పాఠశాలల రక్షణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. దశలవారీగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, సమగ్ర అభివృద్ధి, పటిష్టత కోసం గ్రామీణ ప్రాంతాల్లో మన ఊరు–మన బడి, పట్టణ ప్రాంతాల్లో మన బస్తీ –మన బడి కార్యక్రమం కింద పనులు చేపట్టింది. ఇప్పటికే కొన్ని పాఠశాలలు అన్ని హంగులతో తీర్చిదిద్దారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సిస్టం, తాగునీరు, సోలార్ పీవీ సిస్టమ్స్, భోజనశాల ఫర్నిచర్, ఐఎఫ్‌పీఎస్, డ్యూయల్ డెస్క్‌లు, పాఠశాలలకు పెయింటింగ్, గ్రీన్‌చాక్ బోర్డులు వంటి సౌకర్యాలు సమకూర్చారు. పనులు పూర్తి చేసిన ప్రతీ పాఠశాలలో పగలు, రాత్రి కాపలాదారుని నియమించాలని పాఠశాల విద్య డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే వరకు తాత్కాలిక పద్ధతిన వాచ్‌మెన్‌ల నియామకం చేపట్టాలని సూచించారు.

**నియామకం.. విధులు ఇలా..**

పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా డే, నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వాచ్‌మెన్‌ను నియమించే సమయంలో గత పనితీరు, పూర్వాపరాల ఆధారంగా కాపలాదారున్ని తాత్కాలిక పద్ధతిన విధుల్లోకి తీసుకోవాలి. స్థానికుడై ఉండడంతోపాటు 60 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలనే నిబంధనలున్నాయి. నెలకు రూ.5వేలు గౌరవ వేతనాన్ని ఎంవోఎంటీ, ఎంబీఎంటీ అడ్మిస్ట్రేటివ్ ఖర్చు నుంచి చెల్లిస్తారు.

**బాధ్యతలు..**

కాపలాదారు పగలు, రాత్రి పాఠశాలల భద్రత చేపట్టాల్సి ఉంటుంది. ఏఎఫ్‌పీల ఇన్‌స్టాలేషన్, బ్యాటీర్ ఆఫ్ ట్యాప్స్, డ్యూయల్ డెస్క్‌లు, డ్రికింగ్, సోలార్ ప్యానల్‌లతోపాటు మొక్కలకు నీరు పెట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణలో క్రమం తప్పకుండా చూడడం, వార్డు విధులు, అనధికార వ్యక్తులు పాఠశాలలోకి ప్రవేశించకుండా చూడాల్సి ఉంటుంది. తాత్కాలిక పద్ధతిన నియమించే వాచ్‌మెన్‌కు గౌరవ వేతనాన్ని విడుదల చేసేందుకు నెలవారీ హాజరు అందించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

**జిల్లాల వారీగా..**

| జిల్లా | పాఠశాల సంఖ్య |
|---|---|
| ఆదిలాబాద్ | 32 |
| కుమురంభీం | 65 |
| నిర్మల్ | 88 |
| మంచిర్యాల | 85 |

## బొమ్మలకు శుభమంగళం

- చిన్నారులే పెండ్లి పెద్దలుగా..
- కుమురంభీం జిల్లా తాటిపల్లిలో అట్టహాసంగా బొమ్మల పెళ్లి



తాటిపల్లిలో బొమ్మల పెళ్లి జరిపిస్తున్న చిన్నారులు

కౌటాల(సిర్పూర్): పెళ్లికూతురు అందంగా ముస్తాబైంది. పెళ్లి కుమారుడు మండపంలో కూర్చొని సిద్ధంగా ఉన్నాడు. చిన్నపిల్లలు తోడుగా రాగా.. వధువు సిగ్గుపడుతూ మండపానికి విచ్చేసింది. చిన్నారులే పెండ్లి పెద్దలుగా వ్యవహరించి వేదమంత్రాలతో కల్యాణం జరిపించారు. వధువు, వరుడు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కుమురంభీం జిల్లా కౌటాల మండలం తాటిపల్లిలో గురువారం రాత్రి నిర్వహించిన బొమ్మల పెళ్లిలో కనిపించిన చూడముచ్చటైన దృశ్యమిది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ప్రజలు మరాఠా సంప్రదాయాలు పాటిస్తారు. ఏటా సంప్రదాయాలు, వివాహ బంధం, కుటుంబ విలువలపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు బొమ్మల పెళ్లిళ్లు నిర్వహిస్తారు. వేసవిలో విద్యాసంస్థలకు సెలవులు రావడం, మంచి ముహూర్తాలు ఉండడంతో తాటిపల్లిలోని హనుమాన్ ఆలయంలో గ్రామానికి చెందిన చిన్నారులు వధువు, వరుడు బొమ్మలను అందంగా అలంకరించి వివాహం జరిపించారు. సంప్రదాయం ప్రకారం గణపతి గజముఖం, మంగళాష్టకాలులను చదువుతూ.. శుభ మంగళ సావధాన్ మంత్రం పఠిస్తూ పెళ్లి తంతు పూర్తి చేశారు. ఈ వేడుక నిర్వహణకు చిన్నారులే నగదు జమ చేసుకుని ఖర్చు భరించడం విశేషం. వివాహం అనంతరం విందు సైతం ఏర్పాటు చేశారు.

## నిర్మానుష్యంగా.. సుంకిడి



నిర్మానుష్యంగా మారిన గ్రామం



పోలీసుల బందోబస్తు

తలమడుగు: నిత్యం స్థానికులతో రద్దీగా ఉండే సుంకిడి గ్రామం శుక్రవారం నిర్మానుష్యంగా మారింది. గ్రామస్తులంతా ఐదేళ్లకోసారి చాందా గ్రామంలోని శ్రీ మహాలక్ష్మిదేవి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే వీరంతా అక్కడికి వెళ్లారు. పూజల అనంతరం అక్కడే వండుకొని భోజనా లు చేశారు. రాత్రి ఇళ్లకు చేరుకున్నారు. కాగా, ఊరంతా ఖాళీ కావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి ఎ మ్మెల్యే రాథోడ్ బాపూరావు, మాజీ ఎంపీ నగేశ్ స ర్పంచ్, మహేందర్ తదితరులు వెళ్లారు.